ప్రకృతి పరవశం.. ఆధ్యాత్మిక వైభవం

- ప్రముఖ శైవక్షేత్రంగా విలసిల్లుతున్న బృహదాచలం
- దేవతలు కొలువైన ప్రాంతంగా స్థానికుల నమ్మకం
- భక్తుల పూజలందుకుంటున్న నారాయణేశ్వరులు


ప్రత్యేక అలంకరణలో శ్రీరంగనాథుడు


శ్రీరంగనాథుని ఆలయం


భక్తులు స్నానమాచరిస్తున్న పుట్టుధార

తగరపువలస: ఆనందపురం మండలం పాలవలస పంచాయతీ గుడిలోవను సందర్శించే వారికి భక్తిభావంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కూడా రారమ్మని ఆహ్వానం పలుకుతుంది. ఆనందపురం–పెందుర్తి రహదారికి రెండు కిలోమీటర్ల దూరంలో బృహదాచలం పేరుతో నలువైపులా పచ్చని కొండల మధ్య ఎత్తయిన ప్రదేశంలో ఉండే ఈ క్షేత్రానికి పురాణ ప్రాశస్త్యం కూడా ఉంది. ప్రముఖ శైవక్షేత్రంగా పిలుచుకునే ఈ ప్రాంతంలో పూర్వం దేవతలు సంచరించే వారని ప్రతీతి. మునులు తపస్సు ఆచరించడానికి ఈ ప్రాంతానికి వచ్చేవారట. 200 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ క్షేత్రంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రముఖంగా శ్రీరంగనాథస్వామి దేవస్థానం ఉంది. ఈ ఆలయానికి 105 ఎకరాల తోటలు, భూములు ఉన్నాయి. కొండపై పనస, సంపంగి, మామిడి, ఉసిరి తదితర పండ్లు, పూలతోటలతో పాటు దేవతా వృక్షాలు ఉన్నాయి. ఇదే క్షేత్రంలో ఒకే శిఖరం కింద ఉన్న నారాయణేశ్వరులు ఏడాది పొడవునా భక్తుల పూజలు అందుకుంటున్నారు. ఈ ఆలయ గర్భగుడి కింద నుంచి శివకేశవుల పాదాలను నిత్యం తాకుతూ ప్రవహించే పుట్టుధార నుంచి సేకరించిన నీటితో అభిషేకాలు నిర్వహిస్తారు. అలాగే భక్తులు స్నానమాచరించడానికి, ఆలయం శుభ్రం చేయడానికి కూడా ఈ ధారను వినియోగిస్తుంటారు. ఈ ఆకాశగంగలో స్నానమాచరిస్తే మానసిక ప్రశాంతత కలగడంతో పాటు శారీరక సమస్యలు బాధించవని భక్తుల విశ్వాసం. ఇక్కడికి కొంచెం దూరంలో కొండపై విష్ణుపాదాలు వెలిసినట్టు భక్తులు చెబుతారు. ఇప్పటికీ ఈ క్షేత్రంలోని ఆలయాల్లో దేవసర్పాలు భక్తులకు దర్శనమిస్తుంటాయి. కానీ ఎవరికీ ఎలాంటి హాని చేయకపోవడం ఇక్కడి గొప్పతనం. ఆలయ అభివృద్ధిలో భాగంగా పదేళ్ల క్రితం కొండపైకి రూ.15 లక్షలతో సీసీరోడ్డు నిర్మించారు. గతంలో ఆలయ కమిటీ పెందుర్తి–ఆనందపురం రహదారిపై నుంచి ప్రయాణించే వారికి కనిపించేలా ఎత్తయిన ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ తవ్వకాలలో బయటపడిన పురాతన శివాలయం, శివలింగం, నంది విగ్రహాల ఆనవాళ్లు ఇక్కడ చూడవచ్చు.

వనభోజనాలకు ప్రత్యేక ఎంపిక..

గుడిలోవ కొండపై వెలసిన బృహదాచలక్షేత్రాన్ని కార్తీకమాసంలో భక్తులు ప్రముఖ పిక్నిక్ స్పాట్‌గా ఎంపిక చేసుకుంటారు. బృందాలుగా ఈ కొండపైకి చేరుకుని చెట్ల కింద వంటలు చేసుకుని సామూహిక వన భోజనాలు చేస్తారు. గతంలో కొండ కింద నుంచి పైకి నిర్మించిన మెట్ల మార్గం పూర్తిగా శిథిలం కావడంతో సగం వరకు మాత్రం పునర్ నిర్మించారు. శ్రీరంగనాథుని ఆలయం నుంచి నారాయణేశ్వరుల ఆలయం వరకు నడక మార్గాన్ని నిర్మించారు. పుట్టుధార నుంచి వచ్చే నీటిని నిల్వ చేసి చెట్ల పెంపకానికి మళ్లిస్తున్నారు.


నారాయణస్వామి


శివలింగంలో శివకేశవులు, కింద ఆకాశగంగ


తవ్వకాలలో బయటపడ్డ శివలింగం


నారాయణేశ్వరుని ఆలయం

పదేళ్ల క్రితం హుద్‌హుద్ ఈ క్షేత్రాన్ని కొంత మేర నష్టపరిచింది. 15 ఏళ్ల క్రితం ఈ ఆలయానికి చెందిన సర్వే నంబర్ 69లో ఎ.26.25 సెంట్లు ఆక్రమణకు గురి కాగా హైకోర్టు జోక్యంతో ఇటీవల దేవదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రశాంతతకు మారుపేరు



నగర వాతావరణం, కాలుష్యానికి దూరంగా పచ్చటి కొండల నడుమ ఉన్న ఈ క్షేత్రానికి చేరుకుంటే మానసిక ప్రశాంతత, దైవ ఆశీర్వాదం లభిస్తాయి. ఇక్కడ వీచే గాలులు, పక్షుల కిలకిలారావాలు మనల్ని మరో లోకంలోకి తీసుకెళ్తాయి.

–పి.కొండలరావు, ఆనందపురం

పుట్టుధార ఆశ్చర్యం



బృహదాచలంలోని నారాయణేశ్వరుల పాదాల కింద నుంచి పుట్టుధారగా పిలిచే ఆకాశగంగ నిత్యం ప్రవహిస్తుంది. ఇది ఎక్కడి నుంచి వస్తుందో ఇప్పటికీ అంతు చిక్కడం లేదు. ఈ నీటిని భక్తులు పరమ పవిత్రంగా భావిస్తారు.

–సర్వసిద్ధి చిన్నారావు, ఆనందపురం.

అష్టలక్ష్మి దేవాలయంలో విశేష పూజలు


పాలకడలిలో లక్ష్మీనారాయణులు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో కార్తీక మాసం ద్వాదశి సందర్భంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా సుప్రభాత సేవ, అనంతరం తులసి మాలలతో లక్ష్మీనారాయణులకు తోమాల సేవ చేసి 108 లీటర్ల పాలతో లక్ష్మీనారాయణులకు అభిషేకం జరిపారు. పాలు, గర్భాలయంలో ఉంచి ప్రత్యేకంగా అలంకరించిన క్షీరసాగరంలో లక్ష్మీనారాయణులను ఉంచి భక్తులకు దర్శనం కల్పించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారయణ, రమాదేవి దంపతులు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

అనంతవరం గ్రామ సభకు 12 దరఖాస్తులు

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో రీసర్వేలో తప్పుల సవరణకు బుధవారం నిర్వహించిన గ్రామ సభలో 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో పేర్లు సరిచేయాలని ఎనిమిది, విస్తీర్ణం సరిచేయాలని నలుగురు దరఖాస్తు చేశారు. తహసీల్దార్ కె.ఆనందరావు ఈ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ తొలేళ్ల సంబరం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో బుధవారం తొలేళ్లతో బంగారమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమలైన ఘటాలను గ్రామంలో ఊరేగించారు. గురువారం రథాల ఉత్సవం జరుగుతుంది. అమ్మవారి ఆలయం, పరిసరాలు విద్యుదీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. ఈ కారణంగా తగరపువలస మెయిన్‌రోడ్డు, చిట్టివలస, కొత్తపేట, సంతపేట, కొండపేట, బంగ్లామెట్ట, గణేష్ థియేటర్ రోడ్డు, ఆదర్శనగర్, సప్తగిరి లేఅవుట్, జ్యూట్‌మిల్లు కార్మికవాడ లైన్లు, రామన్నపేట, చిల్లపేట, జీరుపేట, ఊళ్లపేట, సంగివలస, తాటితూరు, టి.నగరపాలెం, మజ్జివలస, శింగనబంద, లక్ష్మీపురం, విజయరాంపురం, నారాయణరాజుపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని విశాఖ జోన్–3 ఈఈ (ఆపరేషన్) పి.శ్రీనివాసరావు తెలిపారు.

ఆలోచింపజేసిన సైన్స్ ఎక్స్‌పో

కొమ్మాది: చిల్డ్రన్స్‌డేను పురస్కరించుకుని భీమిలి బీచ్‌రోడ్డు తిమ్మాపురంలో గల విజ్ఞాన్ వరల్డ్ వన్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో తల్లిదండ్రులు, సిబ్బందిని ఆకట్టుకుంది. విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. టెన్స్, డివిజన్ మిషన్, సీజన్స్, తెలుగు మహాకవులు, సౌర కుటుంబం, పోనిటిక్ వర్డ్ హంట్, వాటర్ ప్యూరిఫయిర్ సిస్టమ్, తెలుగు, ఇంగ్లీష్ వ్యాకరణాలు, వర్క్ ఆఫ్ రివర్స్ వంటి పలు ప్రాజెక్టుల గురించి విద్యార్థులు వివరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చైతన్య, పద్మావతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సుత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లిని బుధవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ నెల 18న అమ్మవారి ఆలయాన్ని కూల్చివేయనున్నందున పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం పక్కన నిర్మించిన బాల ఆలయంలో గురువారం అమ్మవారి మరో ప్రతి రూపాన్ని ప్రతిష్టించి తాత్కాలికంగా పూజలు నిర్వహించనున్నారు. 2026 మే నెలలో నిర్వహించనున్న పండగ నాటికి ఆలయాన్ని పునరుద్ధరించనున్నారు.

క్రీడలు.. బహుళ ప్రయోజనాలకు బాటలు


మాట్లాడుతున్న విద్యా శాఖ రీజనల్ డైరెక్టర్ విజయకుమార్

పీఎం పాలెం: విద్యార్థి దశలో క్రీడల పట్ల ఆసక్తి కనబరిచే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ బి. విజయ కుమార్ అన్నారు. బుధవారం శాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో మాలతాంబ స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బాగా చదవాలి.. వేళకు ఆహారం తీసుకోవాలి.. బాగా ఆటలు ఆడాలన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యాలకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు ఎంచుకున్న క్రీడల పట్ల వారి తల్లిదండ్రులు ప్రోత్సహించి నప్పుడు ఉత్తమ క్రీడాకారులు కాగలరని ఆయన పేర్కొన్నారు. మాలతాంబ విద్యాసంస్థల చైర్మన్, జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ మహంతి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆటలు, యోగ సాధన ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందించుకుని, మానసిక వత్తిడిని అధిగమించవచ్చన్నారు. స్థానిక లా –అండ్ ఆర్డర్ ఎస్‌ఐ కె.భాస్కర్ మాట్లాడుతూ చిన్న నాటి నుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకోవాన్నారు. సాంకేతిక విద్యాసంస్థల ఎగ్జికూటివ్ ఆఫీసర్ మధుభట్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా విన్యాసాలు అలరించాయి. అనంతరం ఆర్‌జేడీ విజయకుమార్ క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. స్పోర్ట్స్ మీట్‌కు సుమారు 300 మంది విద్యార్థులు హాజరు కాగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.ఆదిమూర్తి, సిబ్బంది బి.శ్రీదేవి, హరీష్ తదితర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


పారిశుధ్య కార్మికుడికి దుస్తులు అందిస్తున్న జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయంలో బుధవారం పారిశుధ్యకార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఇటీవల విజయవాడ వరద బాధితులకు సాయం చేయడానికి ఇక్కడి నుండి వెళ్లిన పారిశుధ్య కార్మికులు అక్కడ సేవలు అందించి వచ్చారు. వారికి ఇప్పుడు జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి చేతుల మీదుగా దుస్తులు అందించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ ఎంతో శ్రమపడి కార్మికులు సేవలందించారని, మగవారికి దుస్తులు, ఆడవారికి చీరలు అందించినట్లు తెలిపారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ


శిక్షణలో పాల్గొన్న వీవోఏలు, పంచాయతీ, సచివాలయాల సిబ్బంది

తగరపువలస: ఆనందపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీడీవో వి.జానకి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై వీవోఏలు, గ్రామ పంచాయతీ, సచివాలయాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది. 2025–26 సంవత్సరానికి నిధుల సమీకరణ, పంచాయతీల అభివృద్ధికి సుస్థిర ప్రణాళిక తయారు చేయడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని ఎంపీడీవో తెలిపారు. వీరికి పంచాయతీ కార్యదర్శులు ధనుంజయ్, శ్రీరామమూర్తి, కంప్యూటర్ ఆపరేటర్ డి.వి.వి.ఎస్.ఎన్.మూర్తి శిక్షణ ఇచ్చారు.

ముగిసిన సాగరదుర్గ ఉత్సవాలు


సాగరదుర్గ ఆలయంలో పూజలు చేస్తున్న విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

పద్మనాభం: మండలంలోని మద్దిలో మూడు రోజులుగా జరుగుతున్న సాగరదుర్గ ఆలయ విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రవేశం, విగ్రహ ప్రతిష్ట వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. నెల్లిమర్ల శ్రీదుర్గ మహా పీఠం పీఠాధిపతి శ్రవణ చైతన్య చిన్నస్వామి, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విశాఖ జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ పద్మనాభం మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, భీమునిపట్నం మండల శాఖ అధ్యక్షుడు గాడు శ్రీను, మద్ది సర్పంచ్ బుగత సన్యాసమ్మ, సత్యనారాయణ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈ సందర్భంగా 5 వేల మందికి అన్నదానం చేశారు.

వాహనాల రాంగ్ పార్కింగ్‌పై చర్యలు


రాంగ్ పార్కింగ్ వాహనాలకు జరిమానాలు విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మధురవాడ: పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మధురవాడ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కొద్ది రోజులుగా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. సీఐ సాయి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నట్టు కనిపిస్తోంది. బుధవారం మధురవాడ మిథిలాపురి ఉడా కాలనీ, కార్ షెడ్ పరిసర ప్రాంతాల్లో రోడ్లపై రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు, సెల్లార్‌లో నిబంధనలకు అనుగుణంగా వాహనాల పార్కింగ్ చేసేలా జీవీఎంసీ కనీస చర్యలు చేపట్టకపోవడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహన చోదకులు అంటున్నారు.

కాలనీ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి


నరసాపురంలో కాలనీ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

పద్మనాభం: పీఎం ఆవాస్ యోజన–ఎన్టీఆర్ నగరాల లేఅవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అన్నారు. మండలంలోని నరసాపురం గ్రామంలోని లేఅవుట్‌ను బుధవారం ఆయన సందర్శించారు. లక్ష్యాలకు అనుగుణంగా ఇంకా కాలనీ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉందని, ఇందుకు అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మొత్తం లేఅవుట్లలో 4,200 ఇళ్లు మంజూరు కాగా 495 ఇళ్లు పూర్తయ్యాయని మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని గృహ నిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. అవసరాలకు సరపడ మెటీరియల్ ఉందా లేదా అని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అప్రోచ్ రోడ్లు, డ్రెయిన్లు, ఇళ్ల నిర్మాణాల పనులను పరిశీలించి కలెక్టర్ త్వరితగతిన ఎలా పూర్తి చేయాలో అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈఈ రామకృష్ణ, తహసీల్దార్ కె.ఆనందరావు, ఏఈ పద్మజ ఉన్నారు.

నెలాఖరు నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు, రైతులు

తగరపువలస: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు పండించిన పంటను కొనేందుకు ఈ నెలాఖరు నుంచి ప్రభుత్వం కేంద్రాలను ప్రారంభిస్తుందని భీమిలి ఏవో బి.శివకోమలి తెలిపారు. భీమిలి మండలం తాటితూరు, తాళ్లవలస పంచాయితీల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ధాన్యం కనీస మద్దతు ధర సాధారణ రకానికి క్వింటాల్ రూ.2,300, ఏ గ్రేడ్ రకానికి రూ.2,320గా నిర్ణయించి చెల్లించనుందని ఆమె చెప్పారు. పంట కోసిన తరువాత ధాన్యానికి ఉండవలసిన నాణ్యతా ప్రమాణాల గురించి తెలియజేశారు. రెండో పంటగా చోడి వేసుకోవడానికి రైతు భరోసా కేంద్రాల్లో వేగావతి, ఇంద్రావతి రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల రైతులు వీటిని కొనుగోలు చేసుకోవచ్చని చెప్పారు. సూక్ష్మ సేద్యం పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్ మన్మధరావు మాట్లాడుతూ తుంపర సేద్యం పథకం ద్వారా 50 శాతం, బిందు సేద్యం పథకం ద్వారా 90 శాతం రాయితీతో పరికరాలు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా తీసుకోవాలని సూచించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది కృపామణి, హరీష్, స్వాతి, రమేష్, రైతులు పాల్గొన్నారు.

ఏసు బోధనలు అనుసరణీయం



జాన్‌వెస్లీని సత్కరిస్తున్న పాస్టర్ తదితరులు

మధురవాడ: దయగల దేవుడు, ప్రేమస్వరూపుడైన ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. మారికవలస జీసస్ బ్లెస్సింగ్స్ చర్చిలో బుధవారం రాత్రి నిర్వహించిన హార్వెస్ట్ ఫెస్టివల్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రేమ, దయ, జాలి, కరుణ క్రైస్తవులలో ఉండాలని సూచించారు. చర్చి నిర్వాహకుడు రెవరెండ్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జాన్‌వెస్లీకి దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు వాసుదేవరావు, నూకరాజు, కిషోర్, అనంత్, మహిళల మైత్రులు ఆశ, సుగుణ, చిన్నమ్మలు, ఈశ్వరి, పలు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జైల్ ఆవరణలో పెట్రోల్ బంక్ ఏర్పాటులో కదలిక

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్వహణకు మళ్లీ కదలిక వచ్చింది. సుమారు ఏడేళ్ల కిందట సెంట్రల్ జైల్ ఆవరణలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి అధికారులు సన్నాహాలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్లీ దానికి అధికారులు కదలికను తీసుకొచ్చారు. శ్రీకాకుళం జిల్లా జైల్ సూపరింటెండెంట్ సన్యాసిరావును దీని కోసం మోనటరింగ్ చేయడానికి జైల్ అధికారులు నియమించారు. ఇందులో భాగంగా బుధవారం ఐవోసీఎల్ ప్రతినిధులతో కలిసి సన్యాసిరావు విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించారు.

అక్రమ నిర్మాణాలపై జీవీఎంసీ కమిషర్ ఆగ్రహం


అధికారులను హెచ్చరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 మధురవాడలో అక్రమ నిర్మాణాలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, తీరు మార్చుకోకపోతే ఇబ్బందులు పడతారని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మధురవాడ గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో జీవీఎంసీ జోన్–2 పరిధిలోని 5 నుంచి 13 వరకు గల వార్డుల పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులతో రివ్యూ మీటింగ్ జరిగింది. దీనికి హాజరైన అధికారులు, సిబ్బంది పనితీరుపై సమీక్ష చేశారు. జోన్‌లోని అన్ని విభాగాల్లో ఉన్న సమస్యలు, అభివృద్ధి పనులు జోన్ కమిషనర్ సింహాచలం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో టౌన్ ప్లానింగ్ ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, వార్డు కార్యదర్శులు బాధ్యతతో విధులు నిర్వహించాలని, అక్రమ నిర్మాణాలను ప్లానింగ్ సెక్రటరీలు ప్రోత్సహిస్తే వారిపై కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు కూడా పెడతామన్నారు. జోన్ పరిధిలో విలీన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీధి లైట్ల సమస్యపై దృష్టి సారించాలన్నారు. ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చిన వినతులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజలకు తాగునీరు అందించేందుకు జీవీఎంసీకి రూ. 130 కోట్లు ఖర్చు అవుతుందని నీటి చార్జీలు, ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు చాలా తక్కువగా వసూలు అవుతున్నాయని, రెవెన్యూ అధికారులు వీటిపై దృష్టి సారించాలన్నారు. జనవరి 1 తర్వాత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా నిషేధిస్తామన్నారు.

ప్రైవేటు కాలేజీలో ముఖ్యమైన రివ్యూ..

మీడియాని కూడా అనుమతించకుండా, అధికారులు, సిబ్బంది పనితీరు, ఇతర ముఖ్యమైన అంశాలపై నిర్వహించే ముఖ్యమైన రివ్యూ మీటింగ్ ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేయడంపై విమర్శలు వస్తున్నాయి. పైగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధిస్తామని చెబుతున్న అధికార యంత్రాంగం ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వినియోగం ఏమిటని కొందరు అంటున్నారు. కమిషర్ రాకతో కుక్కలు పట్టడంతో పాటు అన్ని విభాగాలు అధికారులు ఎప్పుడూ లేని హడావుడి చేశారు. కార్యక్రమంలో సీఈ పి. శివప్రసాదరాజు, అదనపు కమిషనర్ సోమన్నారాయణ, సీసీపీ డాక్టర్ సురేష్ కుమార్, యూసీడీ ఏపీడీ ఎం. సత్యవేణి వివిధ విభాగాలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.